'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# వారసత్వ పన్నుపై దుమారం

ప్రజల వ్యక్తిగత సంపద హక్కుల విషయంలో జాతీయపార్టీలు రెండూ దొందూ దొందే అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. ఇటీవల తొలిదశ లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రచారంలో ఈ పన్ను అంశాన్ని లేవనెత్తారు. సంపద, ఆదాయాల్లో పెరుగుతున్న అంతరాలను తగ్గిస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాన్ని ఎత్తిచూపుతూ, కాంగ్రెస్ గెలిస్తే ఆడవాళ్ల మెడల్లో పుస్తెలు కూడా మిగలనివ్వరని, ముస్లింలకు పంచేస్తారని ఆరోపించారు. మరోవైపు వారసత్వ పన్ను తనకు న్యాయంగానే కనిపిస్తుందని కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా సమర్థించారు. ప్రస్తుతానికి కాంగ్రెస్‌ను బోనులో నిలబెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నప్పటికీ వేరే సందర్భాలలో బీజేపీ కూడా ఈ పన్నుకు అనుకూలంగా మాట్లాడింది. 2014లో ఆర్థికశాఖ సహాయమంత్రి జయంత్ సిన్హా, 2018లో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీలు కూడా వారసత్వ పన్నును సమర్థించారు.

ఒక వ్యక్తి వీలునామా రాసి లేదా రాయకుండానే మరణించినప్పుడు సదరు వ్యక్తి ఆస్తులను వారసులు పంచుకోవడం సహజంగా జరిగేదే. అమెరికా తదితర దేశాలు ఈ తరహా ఆస్తి పంపకాలపై వారసత్వ పన్నును విధిస్తున్నాయి. మన దేశంలో వారసత్వ పన్నును ఎస్టేట్ సుంకం పేరిట 1953లో అమలులోకి తెచ్చారు. దానిని రాజీవ్‌గాంధీ హయాంలో 1985లో రద్దుచేశారు. వారసత్వ పన్నును మళ్లీ ప్రవేశపెడితే బాగుంటుందని, కాకపోతే అత్యంత సంపన్నులే లక్ష్యంగా పరిమితులు విధించాలని 2017లో మోదీ హయాంలోని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రతిపాదించారు. 2019లో ప్రధాని నరేంద్ర మోదీ రెండో విడత అధికారంలోకి వచ్చిన తర్వాత వారసత్వ పన్ను అంశం ప్రముఖంగా ముందుకు వచ్చింది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తన తొలి బడ్జెట్‌లో దీన్ని ప్రతిపాదిస్తారని అప్పట్లో వినిపించింది. ఇప్పటికే పెట్రో ధరలు, నిత్యావసర ధరలు పెంచేసి, ప్రజలకు అవసరమయ్యే అన్ని వస్తువులపై అధికంగా పన్నులు వసూలు చేస్తున్నది కేంద్ర ప్రభుత్వం. ఇది చాలదన్నట్టు ఎంతో కష్టపడి కూడబెట్టుకున్న ఆస్తులపై కూడా పన్నులు వేయాలనుకోవడం దుర్భరం.

జాతీయ పార్టీల ఆలోచనా విధానమే ఇలా ఉంటుంది! వీటికి ఎంతసేపూ పన్నులు దండుకోవడంపైనే తప్ప ప్రజల సంక్షేమంపై దృష్టి ఉండదు. తెలంగాణలో గత పదేండ్లు పాలించిన కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో సంపద సృష్టించి ప్రజలకు పంచింది. గొర్రెల పంపిణీ, చేప పిల్లల పంపిణీ, రైతుబంధు, దళితబంధు వంటి పథకాల ద్వారా ప్రజలకు ఉపాధి కల్పిస్తూనే సంపద పెంచుకునేందుకు అవకాశం కల్పించింది. అంతేకాకుండా మౌలిక సదుపాయా లు కల్పించడం, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం ద్వారా ప్రజల ఆస్తుల విలువను చాలా పెంచింది. జాతీయ పార్టీలు ఇలా సంపద పెంచి, సంపద పంచే వ్యూహాన్ని ఎంచుకోకుండా వారసత్వ పన్నును భావావేశ సమస్యగా మార్చి ఎన్నికల్లో లబ్ధి పొందాలని ఆశిస్తున్నాయి. ప్రాంతీయ పార్టీలు రాష్ట్రాలను అభివృద్ధి చేయడం, ప్రజలకు అవసరమైన లబ్ధి చేకూర్చడమే ప్రధానంగా పనిచేస్తున్నాయి. అందుకు దక్షిణాది రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలే నిదర్శనం. జాతీయ, ప్రాంతీయ పార్టీల మధ్య ఉండే ఈ గుణాత్మ క తేడాను ఓటువేసే ముందు ప్రజలు గుర్తుంచుకోవడం మంచిది.

# కంచుకోటల్లో ఓటమి భయం

**కేరళ లోని వయనాడ్‌లో ఇటీవల పోలింగ్ ముగిసింది. కాంగ్రెస్ అప్రకటిత ప్రధాని అభ్యర్థి రాహుల్‌గాంధీకి అసలు మానసిక రాజకీయ సంక్షోభం మొదలైంది. నెహ్రూ-గాంధీ పరివారానికి పెట్టని కోటలుగా ప్రచారంలో ఉన్న రాయ్‌బరేలీ, అమేఠీ పార్లమెంటు స్థానాల్లో తమ కుటుంబసభ్యులు ఇద్దరూ పోటీ చేయాలా? లేదా ఒక్కరైనా బరిలోకి దిగాలా? అనే ధర్మసంకటం కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ఆయన చెల్లెలు ప్రియాంకాగాంధీని ఇంకా పీడిస్తూనే ఉన్నది.**

**18వ లోక్‌సభ ఎన్నికలు ఐదో దశలో భాగంగా మే 20న పోలింగ్ జరిగే ఈ రెండు ప్రతిష్ఠాత్మకమైన స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. కిందటి ఎన్నికల్లో రాహుల్‌ను అమేఠీలో ఓడించి సంచలనం సృష్టించిన బీజేపీ నేత, కేంద్రమంత్రి స్మృతి ఇరానీ మొదటి రోజే నామినేషన్ దాఖలు చేశారు. ఈ రెండు 'కుటుంబ' సీట్లలో అన్నాచెల్లెళ్లు పోటీ చేయాలా? వద్దా? అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ ఎన్నికల కమిటీ ఆదివారం సమావేశమైంది. అయితే ఆ కమిటీ తర్జనభర్జన పడినప్పటికీ చివరికి ఎటూ తేలకుండానే సమావేశం ముగియడం కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న సందిగ్ధతకు అద్దం పడుతున్నది.**



నాంచారయ్య మెరుగుమాల



కాంగ్రెస్ అగ్రనేతల పోటీపై రెండు మూడు రోజుల్లో చెప్తామని, ఇంకా సమయం ఉందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రకటించారు. అయితే ఆయన ప్రకటనకు ముందే లీకులు జోరందుకున్నాయి. ఈ రెండు స్థానాల్లో ఒకచోటే గాంధీ కుటుంబ సభ్యులు పోటీ చేస్తారని, ఇద్దరూ పోటీ చేస్తారని, అమేఠీ నుంచి రాహుల్, రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతారని, అబ్బే అదేం కాదు, త్వరలో రాయ్‌బరేలీ నుంచి రాహుల్, అమేఠీ నుంచి ప్రియాంక నామినేషన్లు వేస్తారని... ఇలా రకరకాలుగా కాంగ్రెస్ వర్గాల నుంచి ఆదివారం మీడియాకు లీకులు అందాయి. 2014 సార్వత్రిక ఎన్నికల నుంచి బీజేపీకి కంచుకోటగా మారిన ఉత్తరప్రదేశ్‌లో పరిస్థితి కొంత మారిందని, బీజేపీకి ఆ రాష్ట్రంలోని మొత్తం 80 సీట్లలో 40కి మించి రావని ఎన్నికల పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అయినా రాయ్‌బరేలీ, అమేఠీలో పోటీ చేయడానికి అన్నాచెల్లెళ్లకు ధైర్యం చాలడం లేదని కాంగ్రెస్ నాయకులే లోపాయికారిగా మీడియాకు ఉప్పందిస్తున్నారు. పోటీ చేస్తే ఒక తంటా, చేయకపోతే మరో తంటా అన్నట్టు తయారైంది కాంగ్రెస్ అగ్రనేత పరిస్థితి. రెండోసారి స్మృతి ఇరానీ చేతిలో ఓటమిపాలైతే పరువు పోతుందనే అనుమానం రాహుల్‌ను వెంటాడుతున్నట్టుంది. అందుకే ఆయన ఇప్పటికీ ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. రెండు సీట్ల జోలికి పోకుండా పోటీకి దూరంగా ఉందామనుకుంటే.. ఓటమి భయంతోనే బరిలోకి దిగడం లేదనే ప్రచారం జరిగే ప్రమాదమూ లేకపోలేదు. దీంతో ఏం చేయాలో తెలియక కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం కూడా అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నది.

**అవి సొంత జాగీర్లా?:** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ భర్త ఫిరోజ్‌గాంధీ మొదటి రెండు పార్లమెంటు ఎన్నికల్లో (1952, 57) రాయ్‌బరేలీ నుంచి ప్రాతినిధ్యం వహించారు. మరణించే వరకు ఆయన రాయ్‌బరేలీ ఎంపీగానే కొనసాగారు. ఈ కారణంగానే 1967లో రాయ్‌బరేలీ నుంచి ఇందిరాగాంధీ మొదటిసారిగా లోక్‌సభ బరిలో దిగారు. అప్పటి నుంచి ఆమె వరుసగా 1971, 1977, 1980లో కూడా అక్కడి నుంచే బరిలోకి దిగారు. 1980లో తొలిసారి మెదక్, రాయ్‌బరేలీ నుంచి పోటీ చేసిన ఆమె రెండుచోట్లా గెలుపొందారు. అనంతరం మెదక్ ఎంపీగా కొనసాగి, రాయ్‌బరేలీ స్థానానికి రాజీనామా చేశారు. మరణించే సమయానికి ఆమె మెదక్ ఎంపీగా ఉన్నారనే విషయం అందరికీ తెలిసిందే. అలహాబాద్‌లో పుట్టి పెరిగిన నెహ్రూ మూడుసార్లు (1952, 1957, 1962) అలహాబాద్, అలహాబాద్ జిల్లాలో అంతర్భాగమైన ఫూల్‌పూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అయితే తండ్రి పోటీచేసి గెలిచిన, ఇందిరమ్మ పుట్టిన అలహాబాద్ ప్రాంతం ఎందుకో మరి నెహ్రూ-గాంధీ కుటుంబానికి 'ఇంటి నియోజకవర్గం' కాలేకపోయింది. రెండుసార్లు ఇందిరాగాంధీ భర్త ఫిరోజ్, ఆయన కన్నుమూశాక సొంత మేనత్త విజయలక్ష్మీ పండిత్ ఉప ఎన్నికలో గెలిచిన రాయ్‌బరేలీ మాత్రమే దేశానికి ప్రథమ కుటుంబంగా చెప్పుకొనే నెహ్రూ-గాంధీ పరివారానికి 'సొంతూరు లేదా సొంత సీటు'గా మారడానికి కారణాలు లేకపోలేదు.

**అలహాబాద్, ఫూల్‌పూర్ స్థానాలు ప్రధానంగా నగర ప్రాంతాలు. నగర ఓటర్లు ఎక్కువగా ఉన్న ఆ స్థానాల్లో గెలుపు అంత తేలిక కాదు. సునాయాసంగా గెలిచేందుకు అవి అనుకూలం కాదు. అందుకే 80 శాతానికి పైగా గ్రామీణ ప్రాంత ఓటర్లున్న రాయ్‌బరేలీ గాంధీ కుటుంబానికి కంచుకోటగా మారింది. అక్కడి అమాయక ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేస్తారనే భావనతోనే ఇందిరమ్మ కుటుంబం ఆ స్థానాన్ని తమ కంచుకోటగా ఎంచుకున్నది.**

అయితే అదే కంచుకోట రాయ్‌బరేలీ ఎమర్జెన్సీ ముగిసే సమయంలో జరిగిన 1977 ఎన్నికల్లో ఇందిరాగాంధీని 50 వేల ఓట్లకు పైగా తేడాతో ఓడించి, ఆధునిక ప్రజాతంత్ర భారత చరిత్రను గొప్ప మలుపు తిప్పింది. అలాగే, నియోజకవర్గాల పునర్విభజనతో అప్పుడే ఉనికిలోకి వచ్చిన పక్క పార్లమెంట్ స్థానం అమేఠీ నుంచి పోటీ చేసిన ఇందిరమ్మ చిన్న కొడుకు సంజయ్‌గాంధీ కూడా తల్లితో పాటే పరాజయం పాలయ్యారు.

**ప్రియాంకను ఎన్నికల బరిలోకి దించరా?:** 1980 ఎన్నికల్లో సంజయ్‌గాంధీ అమేఠీ నుంచి మాత్రమే పోటీ చేశారు. కానీ, ఇందిర మాత్రం మెదక్ నుంచి కూడా బరిలో దిగారు. ఒక్క ఓటమితోనే ధైర్యశాలి ఇందిరమ్మకు రాయ్‌బరేలీపై నమ్మకం సడలింది. అలాగే ఆమె పెద్ద కోడలు, కాంగ్రెస్ నేత సోనియా గాంధీ తొలిసారి 1999లో పార్లమెంటుకు పోటీ చేయాలని నిర్ణయించుకున్నాక రాయ్‌బరేలీతో పాటు కర్ణాటకలోని బళ్లారి నుంచి కూడా బరిలోకి దిగారు. రాయ్‌బరేలీపై నమ్మకం లేకనే ఆమె రెండు చోట్లా బరిలోకి దిగారన్న విషయం అందరికీ తెలిసిందే. ఆ ఎన్నికల్లో రెండు చోట్ల గెలిచిన ఆమె బళ్లారి స్థానానికి రాజీనామా చేసి రాయ్‌బరేలీ ఎంపీగా కొనసాగారు. అప్పటి నుంచి ఆమె రాయ్‌బరేలీ ఎంపీగానే కొనసాగారు. ఈ నెల ఆరంభంలో రాజస్థాన్ నుంచి రాజ్యసభ సభ్యురాలిగా సోనియా ఎన్నికవడంతో ఆమెకు రాయ్‌బరేలీతో ఉన్న బంధం తెగిపోయింది. 2004, 2009, 2014లో లోక్‌సభకు పంపిన అమేఠీలో ఓటమిపాలయ్యే సూచనలు కనిపించడంతో 2019లో రాహుల్‌గాంధీ కేరళలోని కాంగ్రెస్ కంచుకోట వయనాడ్‌కు వలస వెళ్లిపోయారు. అక్కడి నుంచి పోటీ చేసి తన పార్లమెంటు సభ్యత్వాన్ని నిలుపుకొన్నారు. గతంలో తన చేతిలో ఓటమిపాలైన స్మృతి ఇరానీ 2019లో ఘన విజయం సాధించడం రాహుల్ ఎన్నటికీ మరవలేని షాక్‌గానే చెప్పుకోవాలి. అదృష్టవశాత్తూ రెండో దశలో ఎన్నికలు జరిగిన కేరళ వయనాడ్ నుంచి పోటీ చేసిన రాహుల్.. ఇప్పుడు అమేఠీ, రాయ్‌బరేలీలో నామినేషన్ దాఖలుపై గుంపుచింపులు పడుతున్నారు. ఎంత పెద్దనాయకుడైనా సొంత స్థానంలో ఓటమి ఛాయలు కనిపిస్తే రెండో స్థానం నుంచి పోటీ చేయడంలో తప్పు లేదు. మాజీ ప్రధానులు ఇందిర, వాజపేయి, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ వంటి దిగ్గజాలు కూడా ఇలాగే రెండు చోట్ల నుంచి పోటీ చేసినవారే. కానీ, రాయ్‌బరేలీ, అమేఠీ పార్లమెంట్ స్థానాలు తమ కుటుంబానికి కంచుకోటలు అని చెప్పుకొంటూనే అక్కడి నుంచి పోటీపై నెహ్రూ-గాంధీ వారసులు ఇంతగా వెనకాముందూ ఆలోచించడం వారి రాజకీయ అపరిపక్వతకు, ఓటమి భయానికి నిదర్శనం.

ఇక తెలుగు ప్రాంతం విషయానికి వస్తే.. తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినాయకుడు కె.చంద్రశేఖర్‌రావు తన సొంతూరు, ప్రధానంగా పట్టణ ప్రాంతం మూడొంతుల వరకు ఉన్న సిద్దిపేట నుంచి అసెంబ్లీకి, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్ నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు.

**జననేతగా పేరు ప్రఖ్యాతులు వచ్చాక ఎన్టీఆర్, కేసీఆర్, మర్రి చెన్నారెడ్డి వంటి పెద్ద నాయకులు తమ సొంతూళ్లకు ఎంతో దూరంగా ఉన్న నియోజకవర్గాల నుంచి పోటీ చేయడానికి ఏ మాత్రం వెనుకాడలేదు. అలాంటిది కుటుంబ కంచుకోటలుగా చెప్పుకొనే రెండు సీట్ల నుంచి పోటీకి కాంగ్రెస్ అగ్రనేతలు వెనుకాడటం ఆ పార్టీ ఎంతటి దీనస్థితిలో ఉందో చెప్పకనే చెప్తున్నది.**

ఈ నేపథ్యంలో తెలంగాణలోని 17 సీట్లలో తాము 14 గెలిస్తే రాహుల్ ప్రధాని అవుతారని కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం ఎవరిని మభ్యపెట్టడానికో అర్థం కావడం లేదు. మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. 20 ఏండ్లుగా కాంగ్రెస్ అమ్ములపొది నుంచి వదిలిన బ్రహ్మాస్త్రంగా ఊరూవాడా పేరు మోసిన ప్రియాంకావాద్రా ఇప్పుడు 52 ఏండ్లు దాటుతున్న సమయంలోనైనా పార్లమెంటుకు పోటీ చేస్తారా? లేదా? అనే ప్రశ్నకు సమాధానం ఏమిటనేది ఇంకా తేలలేదు. గెలుపు గ్యారెంటీ అన్న చోట నుంచి బరిలోకి దిగడం లేదా పోటీకి దూరంగా ఉండటానికి నెహ్రూ-గాంధీ కుటుంబ సభ్యులకు సంపూర్ణ స్వేచ్ఛ ఉంది. కాంగ్రెస్ పార్టీలోని పెద్ద కుటుంబాల నేతలే పోటీ చేయడానికి వెనుకడుగువేస్తుంటే ఇక సాధారణ నాయకుల పరిస్థితి ఏమిటని కార్యకర్తలు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు? అగ్రనేతలకే నమ్మకం లేకుంటే వాళ్లను ప్రజలెలా నమ్ముతారు, నమ్మి ఓటెలా వేస్తారు?

# నేతన్నపై ఎందుకీ కక్ష?

**సిరిసిల్ల అంటేనే వలసలకు కేరాఫ్ అడ్రస్, ఆత్మహత్యలకు చిరునామా. పాపం.. ఉమ్మడి పాలనలో ఇదీ సిరిసిల్ల నేతన్నల పరిస్థితి. నాడు సిరిసిల్ల కాస్తా ఉరిసిల్లగా మారిపోయింది. నాటి పాలకులు నేతన్నలను కేవలం ఓటు బ్యాంకుగానే చూడటంతో సాంచల సప్పుడు కనుమరుగైంది. సరిగ్గా అలాంటి పరిస్థితులే రాష్ట్రంలో మళ్లీ పునరావృతమవుతున్నాయి. నాలుగు నెలల కాంగ్రెస్ పాలన నేతన్నల బతుకులను అలకల్లోలం చేస్తున్నది.**



జి.రాజేష్ నాయక్
96035 79115




వలస పాలనలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న నేతన్నల బతుకులకు కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కార్ ఊపిరులూదింది. స్థానిక ఎమ్మెల్యే, అప్పటి మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో నేతన్నల వెతలు దూరమయ్యాయి. ఉరిశాలగా మారిన సిరిసిల్ల సిరుల సిల్లగా మారింది. అందుకే గత రెండు దశాబ్దాలుగా సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలు కేటీఆర్ వెన్నంటే నిలుస్తున్నారు. స్వపరిపాలనలో చేనేత పరిశ్రమ కోసం ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించిన కేసీఆర్ సర్కార్ రాయితీలతో పాటు నేత కార్మికులకు పింఛన్లు కూడా మంజూరు చేసింది. బతుకమ్మ చీరల తయారీ కోసం ఆర్డర్లు ఇచ్చి నేతన్నలకు శాశ్వత ఉపాధిని కల్పించింది. దీంతో సిరిసిల్ల మరో షోలాపూర్‌గా రూపుదిద్దుకున్నది. వలసలు పోయిన చేనేత కార్మికులు సిరిసిల్లకు వాపస్ వచ్చిండ్రు. వర్కర్ టూ ఓనర్ పథకానికి శ్రీకారం చుట్టిన కేసీఆర్ ప్రభుత్వం ప్రతి కార్మికుడికి షెడ్డుతో పాటు నాలుగు అత్యాధునిక మరమగ్గాలనూ అందించింది. రూ.174.65 కోట్లతో 64 ఎకరాల్లో నిర్మించిన అపెరల్ పార్క్‌లో 10 వేల మందికి ఉపాధి కల్పించేలా సకల వసతులను కల్పించింది.

రాజీవ్ విద్యామిషన్, సర్వశిక్షా అభియాన్ కార్యక్రమాలకు సంబంధించిన వస్త్రాలు గతంలో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయ్యేవి. రాష్ట్రం ఏర్పాటయ్యాక ఆ ఆర్డర్లను కూడా రాష్ట్రంలోని నేతన్నలకే ఇచ్చింది కేసీఆర్ సర్కార్. దీంతో కార్మికులకు చేతినిండా పని దొరికింది. మగ్గాల ఆధునికీకరణ, రుణాల మాఫీ, మార్కెట్‌తో అనుసంధానం వంటి ఆల్‌రౌండ్ అప్రోచ్‌తో ముందుకుసాగింది. వీటితో పాటు బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్ కానుకల్లో ఇచ్చే వస్త్రాల ఆర్డర్లు కూడా అందడంతో సిరిసిల్ల కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి. చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా సాగిన ఆ మహాయజ్ఞం ఎన్నో గొప్ప ఫలితాలనిచ్చింది.

కానీ, చేతినిండా పనులతో కళకళలాడిన నేతన్నలు ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో మళ్లీ కరువును ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి పాలనలో వస్త్ర పరిశ్రమ ఎలాంటి దుర్భర పరిస్థితుల్లో మునిగిపోయిందో మళ్లీ అలాంటి విపత్కర పరిస్థితినే చవిచూస్తున్నది. అబద్ధపు హామీల పునాదులపై గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ చేనేత కార్మికులను పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లను నిలిపివేసి నేతన్నల బతుకులను రోడ్డుకీడ్చింది. ఫలితంగా నేతన్నల ఆత్మహత్యలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. అయినా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం రావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యక్తిగత కక్షలు తీర్చుకునేందుకు చేనేత కార్మికులను పావులుగా వాడుకోవాలని చూడటం సరికాదు. ఆదుకోవాల్సిన అధికార పార్టీ నేతలే అవమానించేలా మాట్లాడటం సిగ్గుచేటు.

**పదేండ్ల పాటు ప్రజ్వరిల్లిన వస్త్ర పరిశ్రమ చుట్టూ మళ్లీ అంధకారం అలుముకుంటున్నది. చేనేత పరిశ్రమ, కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ సర్కారు ఇకనైనా తన తీరును మార్చుకోవాలి. భేషజాలకు పోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన కార్యక్రమాలను యథావిధిగా కొనసాగించాలి. దీంతోపాటు పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.**

చేనేత కార్మికులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ పెద్దలు కమీషన్లకు కక్కుర్తి పడుతున్నారు. తమిళనాడు, సూరత్‌కు ఆర్డర్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు వార్తలు వెలువడుతుండటమే అందుకు నిదర్శనం. నేతన్నల సంక్షోభాన్ని రాజకీయ కోణంలో కాకుండా పేద, బడుగు, బలహీన వర్గాలైన నేతన్నల కోణంలో చూడాలి. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలి. తద్వారా నేతన్నల ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేయాలి. లేకుంటే కాంగ్రెస్ పార్టీకి ప్రజలే సరైన సమయంలో, సరైన రీతిలో బుద్ధి చెప్తారు.




## నేనూ కమీషన్ తీసుకున్నా!

మీకు తెలుసో లేదో... ఎంపీ, ఎమ్మెల్యేలకు వారి ప్రాంతాల్లో నిర్మించే బస్టాపుల ద్వారానే ఎక్కువ కమీషన్ అందుతుంది. నేనేమీ అబద్ధం చెప్పడం లేదు, గతంలో బీజేపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు నేను కూడా కమీషన్ తీసుకున్నా.



**- దీపక్ జోషి**
మధ్యప్రదేశ్ మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత

**2014లో అధికారంలోకి రావడానికి ముందు నరేంద్ర మోదీ రైతులపై ఎన్నో హామీలు కురిపించారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పింఛన్ మంజూరు చేస్తామన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు కనీస మద్దతు ధరను (ఎమ్మెస్పీ) నిర్ణయించి ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వమే సేకరిస్తుందని వాగ్దానం చేశారు. 200 పనిదినాలు, వ్యవసాయ కూలీలకు అధిక వేతనాలు, పంటలకు బీమా, ప్రతీ పొలానికీ నీరు, ఉచితంగా విత్తనాలు, ఎరువుల పంపిణీ ఇలా.. ఎన్నోన్నో హామీలు కురిపించారు. ఇవన్నీ నమ్మి ప్రజలు బీజేపీకి అధికారాన్ని కట్టబెట్టారు. అయితే, పదేండ్లు గడిచినప్పటికీ ఇచ్చిన ఒక్క హామీని కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదు.**

# అన్నదాత ధర్మాగ్రహం



కడవేర్గు రాజశేఖర్



మోదీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా తీసుకొచ్చిన పంటల బీమా పథకం 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' అన్నదాతలను ఎంతవరకు ఆదుకొన్నదన్న మాట అటుంచితే కార్పొరేట్ కంపెనీలకు మాత్రం కల్పవృక్షంగా మారింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. 2016-20 వరకు ఇన్సూరెన్స్ కంపెనీలకు రూ.2,415.88 కోట్లను బీమా రుసుం కింద రైతులు చెల్లిస్తే, బీమా కంపెనీలు మాత్రం రైతులకు క్లెయిమ్‌ల రూపంలో చెల్లించిన మొత్తం రూ.1,871.54 కోట్లు మాత్రమే. ఈ లెక్కన కంపెనీలు రూ.544.34 కోట్లు లాభపడ్డాయి. మోదీ సర్కార్ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్న మరో పథకం 'హర్ ఖేత్ కో పానీ'. ఏటా ఈ పథకంపై రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తామంటూ ప్రకటించిన మోదీ ప్రభుత్వం.. మొత్తంగా పదేండ్లలో లక్ష కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా రూ.30 వేల కోట్లు కూడా వ్యయం చేయలేదని గణాంకాలు చెప్తున్నాయి. ఉపాధి హామీ పథకానికి కూడా బడ్జెట్ కేటాయింపుల్లో 33 శాతం వరకూ కోత పెట్టారు. వెరసి మన్నులో బంగారు పంటలను పండించే రైతన్న అప్పుల బాధలు భరించలేక, పెరిగిన ఖర్చులతో కుటుంబాన్ని పోషించలేక అదే మన్నులో కలిసిపోతున్నాడు.

పదేండ్ల బీజేపీ సర్కార్ హయాంలో వ్యవసాయరంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని వ్యవసాయరంగ నిపుణులు, మేధావులు చెప్తున్నారు. ఆదాయం లేక, అప్పుల బాధలు భరించలేక 2014 నుంచి 2023 వరకు దాదాపు లక్షా 12 వేల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకొన్నారని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే దేశంలో రోజుకు సగటున 31 మంది రైతులు ఎక్కడో చోట అసువులు బాస్తూనే ఉన్నారు. ఇక ఇదే కాలంలో రోజువారీ కూలీల ఆత్మహత్యల సంఖ్య మరో 3,12,214గా ఉన్నది. వ్యవసాయ కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోవడమే ఈ ఆత్మహత్యలకు ప్రధాన కారణంగా తెలుస్తున్నది. ఓ నివేదిక అంచనా ప్రకారం ఒక్కో రైతు కుటుంబంపై సగటున రూ.74,121 అప్పు ఉన్నట్టు తెలుస్తున్నది. 2013తో పోలిస్తే రైతుల అప్పు ప్రస్తుతం 57 శాతం పెరిగినట్టు సమాచారం.

బీజేపీ సర్కారుపై రైతన్న ఎన్నడూ లేనంత అసహనంతో ఉన్నాడు. ఇది నిజం. పంజాబ్, హర్యానాల్లో ఓట్లడగటానికి గ్రామాల్లోకి వెళ్లిన బీజేపీ నేతలను రైతులు పొలిమేరల దాకా వెంటాడి తరమడమే దీనికి రుజువు. ఎమ్మెస్పీపై నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేస్తున్న కేంద్రంపై మొన్నటికి మొన్న సమరశంఖం పూరించిన అన్నదాతలు.. ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళనలనూ ఉధృతం చేశారు. రెండు మూడు రోజుల కిందటే తమిళనాడుకు చెందిన దాదాపు 200 మంది రైతులు ఎముకలు, పుర్రెలతో జంతర్‌మంతర్ దగ్గర నిరసనలకు దిగడం అంతర్జాతీయ మీడియాలోనూ ప్రధానాంశమైంది. ఆ పుర్రెలు ఎవరివో కాదు, కేంద్ర అసమర్థ విధానాలు, అబద్ధపు హామీలను నమ్మి అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడిన వందలాది అన్నదాతలవే.

**తొలిసారి మోసపోతే.. 'పాపం! అమాయకత్వం పోనీలే' అంటాం. రెండోసారి అలాగే మోసపోతే, 'తెలుసుకోవాలి కదా! ఇంకెన్నిసార్లు చెప్తాం' అని చిరుకోపం చూపించి కాస్త ఓదారుస్తాం. మూడో సారి అలాగే జరిగితే, 'అవివేకం కాక మరేమిటి? ఆ మాత్రం జ్ఞానం ఉండాలిగా' అంటూ మండిపడ్తాం.**

భూమి నుంచి బువ్వను పుట్టించే రైతన్నకు ఇది తెలియంది కాదు. అందుకే, రెండుసార్లు నమ్మి మోసపోయిన అన్నదాత.. ఈ ఎన్నికల్లో మోసం చేసిన వారిని ఎలా దెబ్బకొట్టాలో దృఢంగా నిర్ణయించుకున్నాడు. అవును, రెండున్నరేండ్ల కిందట క్షమాపణలు చెప్తే శాంతించి మన్నించిన అన్నదాత, ఇప్పుడు హస్తిన పెద్దలకు సిరాచుక్కతో బుద్ధి చెప్పాలనుకొంటున్నాడు. తొలి రెండు దఫాల పోలింగ్‌లో అది స్పష్టంగా కనిపించింది కూడా.